సాహితీ వనంలో నవ్య తేజం నరసం

- తెలుగు భాష, సాహిత్యాభివృద్ధికి విశేష కృషి
- సాహిత్య రచనలకు ప్రోత్సాహాన్నిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న వైనం
- ఆరు సంవత్సరాలుగా సాహితీ కార్యక్రమాల నిర్వహణ
- నేడు అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం

కర్నూలు కల్చరల్: స్వేచ్ఛ, స్పందన, సమానత్వం అనే అంశాలు, ఆశయాలుగా నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం (నరసం) రూపుదిద్దుకుంది. మహిళలు రయిత్రులుగా ఒకే వేదికపైకి వచ్చి స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను కథలుగా, కవిత్వంగా సాహిత్య రూపంలో తీసుకువచ్చేలా చేయడం, సమకాలీన సమస్యలపై చక్కటి స్పందనను ఘన పరిచి వాటిని సాహిత్య రూపంలో సమాజానికి తెలియజేయడం, సంస్కరణకు పూనుకోవడం, స్త్రీ పురుషుల మధ్య సమానత్వాన్ని సాధించే దిశగా రచనలు చేయడం, దురాచారాలను రూపుమాపే దిశగా రచయిత్రులు సంస్కర్తలుగా మారడం, భాషా సాహిత్యాన్ని విద్యార్థుల్లోకి తీసుకెళ్లి ప్రోత్సహించడం లక్ష్యంతో నరసం పనిచేస్తోంది. శుక్రవారం మాతృభాషా దినోత్సవం సందర్భంగా 'నరసం' చేస్తున్న, చేయబోయే కార్యక్రమాలు గురించి తెలుసుకుందాం.


నరసం వార్షికోత్సవ కార్యక్రమంలో సభ్యులు

నరసం చేపట్టిన కార్యక్రమాలు

- 2018లో అవధాని బులుసు అపర్ణచే విద్యార్థులే పృచ్ఛకులుగా అష్టావధానం నిర్వహణ
- 2019లో సిల్వర్ జూబ్లీ కళాశాలలో అవధాని మద్దూరి రామమూర్తిచే శతావధానన కార్యక్రమం
- 2019లో దండెబోయిన బాలరంగయ్య స్మారక జానపద కళా పురస్కారాన్ని ప్రకటించారు. బుర్రకథ ప్రదర్శనలను ఏర్పాటు చేశారు.
- 2019లో కవిత, కథలపై శిక్షణ కార్యక్రమం. కొండేపూడి నిర్మల, కృష్ణ, శ్రీవల్లి రాధికలు హాజరై సందేశాలు ఇచ్చారు.
- 2020లో కోవిడ్ సమయంలో ఆన్‌లైన్‌లో విద్యార్థులకు పద్య, వ్యాసరచన, కవితల పోటీలు నిర్వహించారు.
- 2021లో సిల్వర్ జూబ్లీ కళాశాల సహకారంతో మహనీయుల జీవిత చరిత్రలు – మనకు ఆదర్శం అంశంపై రాష్ట్ర స్థాయి వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు.
- 2022లో మార్చి 8న మహిళా దినోత్సవం పురస్కరించుకొని అత్యంత ప్రతిభావంతులైన మహిళలను సన్మానించారు. కవయిత్రుల సమ్మేళనం, ఆటల పోటీలు నిర్వహించారు.
- 2022 మార్చిలో రచయిత్రి ఆరేపల్లి వరలక్ష్మమ్మ రచించిన తొమ్మిది పుస్తకాలు, 2024 సెప్టెంబర్‌లో నాలుగు పుస్తకాలను ఆవిష్కరించారు.
- 2023లో మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు పోటీలు
- 2024లో నారీ కవన విజయం పేరుతో మహిళా సదస్సు నిర్వహించి ప్రముఖులచే ఉపన్యాసాలు చేయించారు.
- 2024లో అధ్యాపకురాలు దండెబోయిన పార్వతీ దేవి రచించిన మూడు రచనలు మనలో మాట, రసస్పందని, బ్రహ్మ గుండం క్షేత్ర చరిత్ర ఆవిష్కరణ
- నరసం సభ్యులచే ఏర్పాటైన స్నేహశ్రీ వెల్ఫేర్ సొసైటీ ద్వారా 2024 మే నుంచి పేద పిల్లలకు వైద్యం అందించడం, ఆర్థిక సహకారం అందించడం లాంటి సేవా కార్యక్రమాలు చేపట్టారు.
- 2025లో ఫిబ్రవరి 16వ తేదీన నరసం 7వ వార్షికోత్సవం, రాష్ట్ర సదస్సు నిర్వహణ

ఆరేళ్లుగా విశేష కృషి

తేళ్ల అరుణ వ్యవస్థాపకులుగా, డాక్టర్ చిన్న లక్ష్మి కళావతి అధ్యక్షులుగా, పాతూరి అన్నపూర్ణ కార్యదర్శిగా ఒంగోలు జిల్లాలో మొట్టమొదటగా నరసం ఏర్పాటైంది. 2018 డిసెంబర్‌లో కర్నూలులో నరసం ఆవిర్భవించింది. అన్ని సంస్థల ప్రతినిధులతో భాషా సాహితీ వేత్తలు, రాజకీయ నేతలు, విద్యావేత్తలు కలగలిసి కందనవోలు కవయిత్రుల ఐక్యవేదిక నరసంకు శ్రీకారం చుట్టింది. అప్పటి నుంచి నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తూ తెలుగు భాషా, సాహిత్యానికి విశేష కృషి చేస్తోంది.

భాషా ప్రక్రియలపై అవగాహన



ప్రాంతీయ భాషలు మాయమైనప్పుడు సంస్కృతి, సంప్రదాయాలు కనుమరుగవుతాయి.అలాగే అమ్మ భాష కనుమరుగయ్యే పరిస్థితులను గుర్తించి ప్రపంచ వ్యాప్తంగా మాతృభాష దినోత్సవం ద్వారా అవగాహన పెంచే ప్రయత్నం జరుగుతోంది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని సంఘం నిర్వహించే ప్ర తి కార్యక్రమంలో విద్యార్థులను భాగస్వాములను చేస్తున్నాం. పద్యం, వచనం, వ్యాసం, వక్తృత్వం, స్వీయ కవితా గానం లాంటి పోటీలు నిర్వహించి బహుమతులు ఇస్తూ ప్రోత్సహిస్తున్నాం.

– సుబ్బలక్ష్మమ్మ, అధ్యక్షురాలు, నరసం

సమాజాభివృద్ధి దిశగా పయనం



సమాజాభివృద్ధి దిశగా విద్యార్థులకు భాష, సా హిత్యాల విషయంలో శిక్షణ ఇవ్వడం, పోటీలు నిర్వహిస్తూ విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్నాం. పాఠశాలలకు వెళ్లి ఉపన్యాసాలు ఇవ్వడం అనేక మంది ప్రసిద్ధులు, సాహిత్య కారులతో ఉపన్యాసాలు ఇప్పించడం చేస్తున్నాం. భాష, సాహిత్యం పట్ల విద్యా ర్థులకు అభిరుచి పెరిగేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. రచయిత్రులు భాషాభివృద్ధిలో తమ వంతు బాధ్యతను నిర్వర్తించడం అభినందనీయం.

– డాక్టర్ పార్వతీ దేవి, కార్యదర్శి, నరసం

క్లుప్తంగా

సర్వీస్ ప్రొవైడర్లుగా రాణించాలి

కర్నూలు (టౌన్): మహిళలు అవకాశాలను వినియోగించుకొని సర్వీస్ ప్రొవైడర్లుగా రాణించాలని, తద్వారా కుటుంబ జీవనోపాధులు పెంచుకోవాలని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ నాగ శివలీల సూచించారు. గురువారం స్థానిక పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక నరసింహారెడ్డి నగర్‌లో ఉన్న విజన్ కళాశాలలో బ్యూటీషియన్ కోర్సు శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శిక్షణ పూర్తి చేసుకొని సర్టిఫికెట్ పొందిన వారు హోమ్ ట్రయాంగిల్ ప్లాట్‌ఫారం ద్వారా జీవనోపాధి పెంచుకోవచ్చన్నారు. నైపుణ్యంతో తమ ఊరిలోనే సేవలు అందించవచ్చన్నారు. ఆసక్తి కలిగిన వారు బ్యూటీషియన్ కోర్సులో చేరవచ్చన్నారు. మెప్మా సిటీ మిషన్ మేనేజర్ భాస్కర్ రెడ్డి, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణను విరమించుకోవాలి

కర్నూలు(సెంట్రల్): వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ కేరళ తరహాలో రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని ఆవాజ్ నగర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పి.ఇక్బాల్ హుస్సేన్, ఎస్ఎండీ షరీఫ్ డిమాండ్ చేశారు. గురువారం ఆవాజ్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మైనార్టీలపై అభాండాలు వేస్తూ మోసపూరిత పాలన చేస్తోందన్నారు. మైనార్టీ సంస్థలకు చెందిన వక్ఫ్ ఆస్తులను కొల్లగొట్టేందుకే వక్ఫ్ సవరణ చట్టం తెస్తోందన్నారు. దీన్ని అన్ని రాజకీయ పార్టీలు వ్యతిరేకించాలన్నారు. ఏపీలోని టీడీపీ, జనసేన పార్టీలు కూడా వ్యతిరేకించాలని, లేదంటే వారికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

23న ఉచిత వైద్య శిబిరం

కర్నూలు(సెంట్రల్): సుందరయ్య స్ఫూర్తి కేంద్రం, జీబీఆర్ ఫౌండేషన్, ఏపీ మెడికల్ అండ్ సేల్స్ రెప్రజెంటేటివ్స్ ఆధ్వర్యంలో ఈ నెల 23న ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ కన్వీనర్ ప్రసాద్ శర్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.ఇందిరాగాంధీ నగర్‌లోని సుందరయ్య భవన్‌లో ఉద యం 8 నుంచి 11 గంటల వరకు శిబిరం నిర్వ హిస్తామని, పక్షవాతం, బీపీ, షుగర్, ఫిట్స్ వ్యాధులకు వైద్యులు సూచించిన మందులను తక్కువ ధరకే అందిస్తున్నట్లు చెప్పారు.

ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలి

కర్నూలు(సెంట్రల్): ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని వైఎస్సార్ జిల్లా కేంద్రం కడపలోనే కొనసాగించాలని సీఐటీయూ ఓల్డ్‌సిటీ అధ్యక్షుడు అబ్దుల్ దేశాయ్ డిమాండ్ చేశారు. గురువారం జెడ్పీలోని ఏపీజీ బ్యాంకు ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కడపలో అన్ని వసతులతో ఉన్న ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని మరో ప్రాంతానికి ఎందుకు తరలిస్తున్నారో చెప్పాల ని డిమాండ్ చేశారు. తమకు సమాధానం చెప్పిన తరువాతే తరలించాలని, అంతవరకు తరలించేందుకు చూస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో దూదేకొండ కుమార్, రామకృష్ణ, సామేలు, పాల్గొన్నారు.

నకిలీ బర్త్ సర్టిఫికెట్లపై విచారణ చేయండి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలులో నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలు (బర్త్ సర్టిఫికెట్లు) సృష్టించడంపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక న్యాయవాది గణేష్ కోరారు. ఈ ఘటనపై ఆయన గత నెల 25వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఫిర్యాదు చేశారు. అలాగే నకిలీల ఘటనపై గత నెల 24వ తేదిన 'సాక్షి' దినపత్రికలో 'నకిలీ సర్టిఫికెట్లు పుట్టుకొస్తున్నాయ్!' శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఆసుప త్రి సీఎస్ఆర్ఎంఓ సంతకాన్ని ఫోర్జరీ చేసి నకి లీ జనన ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్నా రని, అ లాంటి వారిపై చర్యలు తీసుకోవాలని సూప రింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లుకు, స్థానిక మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేశామన్నారు.ఇలాంటి నకిలీ సర్టిఫికెట్ల ద్వారా పాస్‌పోర్టులు, ప్రభుత్వం అందించే పలు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. అయితే ఇందుకు సంబంధించి అధికారుల నుంచి ఎలాంటి స్పందన, చర్యలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు.

కోలుకోలేక మహిళ మృతి

కర్నూలు: జోగులాంబ గద్వాల జిల్లా అనంతపురం గ్రామానికి చెందిన కొండమ్మ (31) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతిచెందింది. ఈ నెల 15న భర్త ఎల్లప్పతో కలిసి స్వగ్రామం నుంచి కర్నూలుకు వస్తుండగా పంచలింగాల వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో దంపతులిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. ఎల్లప్ప చికిత్స పొందుతూ 16వ తేదీ మృతి చెందగా కొండమ్మ చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందింది. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం ఉన్నారు. ప్రమాద ఘటనపై కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

యువత పాత్ర కీలకం

కర్నూలు (టౌన్): దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని ట్రిపుల్ ఐటీ డీఎం చైర్‌పర్సన్ విజయలక్ష్మీ దేశ్‌మన్ స్పష్టం చేశారు. గురువారం జగన్నాథగట్టు వద్ద ఉన్న ట్రిపుల్ ఐటీ డీఎం వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. డైరెక్టర్ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హైదరబాద్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బీజే రావు మాట్లాడారు. అనంతరం ట్రిపుల్ ఐటీ డీఎం లోగో, పోస్టల్ స్టాంపులను ఆవిష్కరించారు.

బీసీ కులగణన చేపట్టాలి


సంఘీభావం తెలుపుతున్న బీసీ సంఘాల నాయకులు

కర్నూలు(అర్బన్): రాష్ట్రంలో బీసీ కులాల గణన చేపట్టాలని పలు బీసీ సంఘాల నేతలు కోరారు. గురువారం స్థానిక బీసీ భవన్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు ఆధ్వర్యంలో బీసీ కుల సంఘాల నేతల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నక్కలమిట్ట శ్రీనివాసులు మాట్లాడుతూ.. బీసీల జనాభా నిష్పత్తి ప్రకారం విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో వాటాలు కల్పించాలన్నారు. రాష్ట్రంలో బీసీ సబ్ ప్లాన్ అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు విద్య, ఉద్యోగ రంగాల్లో ఏబీసీడీ వర్గీకరణ చేసిన విధంగానే రాజకీయ రంగాల్లో కూడా వర్గీకరణ చేసి ఎంబీసీ కులాలకు న్యాయం చేయాలన్నారు. ఇంతవరకు చట్టసభల్లో అడుగుపెట్టని ఎంబీసీ కులాలకు రాజ్యసభ, ఎమ్మెల్సీ, రాష్ట్రస్థాయి నామినేటెడ్ చైర్మన్ పదవులు కేటాయించాలన్నారు. ఆయా కుల కార్పొరేషన్ల ద్వారా లబ్ధిదారులకు రుణాలు అందించే విషయంలో బ్యాంకులతో సంబంధం లేకుండా నేరుగా రుణాలను అందించాలన్నారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో బీసీల అభివృద్ధికి, సబ్‌ప్లాన్ అమలుకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. ఈ డిమాండ్ల సాధనకు దశల వారీగా ఉద్యమాలకు శ్రీకారం చుడతామన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వరరావుయాదవ్, బీసీ నాయకులు ఎం.రాంబాబు, ఆనంద్‌బాబు, ధర్మ, వాడాల నాగరాజు, రంగా తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంట్లో రాజ్యాంగ పుస్తకం ఉండాలి

కర్నూలు కల్చరల్: ప్రతి ఇంట్లో భారత రాజ్యాంగ పుస్తకం ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పి.లీలా వెంకటశేషాద్రి పేర్కొన్నారు. గురువారం క్లస్టర్ విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రభుత్వ పురుషుల కళాశాల, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన వేదిక, సామాజిక న్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే ఉచిత న్యాయ సేవలను ప్రజలందరూ వినియోగించుకోవాలన్నారు. న్యాయ సేవల అవగాహన కోసం ప్రతి ఇంట్లో భారత రాజ్యాంగం ఉండాలన్నారు. న్యాయ చట్టాలను పాటిస్తామని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరాశాంతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యుడు రాయపాటి శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపల్ హేమంత్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి పి.లీలా వెంకటశేషాద్రి

పరిశ్రమలను ఏర్పాటు చేయాలి

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పించడం కోసం పరిశ్రమలను ఏర్పాటు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు గౌడ్, నగర కార్యదర్శి బీసన్న డిమాండ్ చేశారు. గురువారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం 31 అంశాలతో తీర్మానాలు చేశామని, వాటి అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు పోరాటాలకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఓర్వకల్ ఇండస్ట్రియల్ హబ్‌లో పరిశ్రమలను ఏర్పాటు చేయాలని, పత్తికొండలో టమాటా జ్యూస్ ఫ్యాక్టరీ, ఎమ్మిగనూరులో స్పిన్నింగ్ మిల్లులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ఏటా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామన్న నారా లోకేష్ మాట నిలబెట్టుకోవాలన్నారు. నాయకులు షాబీర్‌బాషా, సోమన్న, చంటి, అఖిల్, నవీన్, శివ పాల్గొన్నారు.

పీ-4 సర్వేకు సహకరించాలి

కర్నూలు (టౌన్): నగరంలో పబ్లిక్, ప్రైవేటు, పీపుల్స్, పార్టనర్‌షిప్ (పీ – 4) సర్వేకు నగర ప్రజలు సహకరించాలని కమిషనర్ ఎస్.రవీంద్రబాబు గురువారం ఒక ప్రకటన ద్వారా కోరారు. పేదరిక నిర్మూలనలో భాగంగా అత్యున్నత ఆర్థిక స్థానాల్లో ఉన్న వారిలో 10 శాతం మంది అట్టడుగున ఉన్న వారిలో 20 శాతం మందికి చేయూత అందించేందుకు ఈ సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటి కుటుంబ ఆర్థిక పరిస్థితిని అంచనా వేసేందుకు ప్రభుత్వ ప్రాజెక్టుల ద్వారా అవసరమైన కుటుంబాలకు ప్రైవేటు రంగ సహాయాన్ని అందించడం వంటి లక్ష్యాలతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. ప్రతి ఇంటికి సచివాలయ కార్యదర్శులు వస్తారని, వారు కోరిన సమచారాన్ని ప్రజలు అందించాలని సూచించారు. ఈ నెల 20 నుంచి నగరంలోని 52 వార్డుల్లో వచ్చే నెల 2వ తేదీ వరకు ఈ సర్వే జరుగుతుందని తెలిపారు. పేదరిక నిర్మూలనకు దోహదపడే ఈ సర్వేకు నగర ప్రజలు సహకరించాలని కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కర్నూలు(సెంట్రల్): రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు బకాయి ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు రూ.3500 కోట్లను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ, ఉపాధ్యక్షుడు రమణకుమార్ డిమాండ్ చేశారు. గురువారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. వెంటనే అమ్మ ఒడి పథకాన్ని అమలు చేసి ప్రతి విద్యార్థి తల్లి ఖాతాలో రూ.15 వేలు జమ చేయాలన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.5 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచి ఇవ్వాలన్నారు. అన్ని హాస్టళ్లకు సొంత భవనాలను కట్టించి ఇవ్వాలన్నారు. యూజీసీ డ్రాఫ్ట్ సవరణను ఉపసంహరించుకోవాలని కేంద్రాన్ని కోరారు. నాయకులు దామోదర్, రాజు, మద్దూరు, సూర్య, సాయి పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ హామీ అమలుచేయాలి

కర్నూలు(సెంట్రల్): సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రజక లాండ్రీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాన్ని వెంటనే అమలు చేయాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సి.గురుశేఖర్ డిమాండ్ చేశారు. అలాగే రజకులకు అవసరమైన దోబీలు, లాండ్రీ పరికరాలను ఉచితంగా ఇవ్వాలన్నారు. గురువారం చాకలి ఐలమ్మ కార్యాలయంలో ఏపీ రజక వృత్తిదారుల ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రజకుల రక్షణకు చట్టం తేవాలన్నా రు. గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ రజకులపై దాడులు జరుగుతున్నాయన్నారు. వాటి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. మార్చి 22న జరిగే 6వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సి.ముక్కన్న, రాముడు, శ్రీనివాసులు, శేషాద్రి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సి.గురుశేఖర్

మాతృ భాషపై మమకారం

కర్నూలు (అర్బన్): మాతృభాషపై ఆయనకు ఎంతో మమకారం... మమ్మీ, డాడీ, అంకుల్, ఆంటీ అనే ఆంగ్ల పిలుపులను సున్నితంగా తిరస్కరిస్తూనే... అమ్మ, నాన్న, అత్త, మామ అనే పలకరింపులోని మాధుర్యాన్ని చిన్నారుల పెదవులకు అందించాలని తాపత్రయ పడుతుంటారు. పంచాయతీరాజ్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించిన జీవీ కృష్ణారెడ్డి ప్రభుత్వంతో జరిపే ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ నేటికీ తెలుగులోనే జరుపుతున్నారు. దశాబ్దం క్రితమే అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి అవార్డును కూడా అందుకున్నారు. నందికొట్కూరుకు చెందిన గ్రంధే హనుమంతు, ఈశ్వరమ్మ దంపతులకు జన్మించిన క్రిష్ణారెడ్డి ఎంఏ, బీఎడ్ పూర్తి చేసి పంచాయతీరాజ్ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. వివిధ హోదాల్లో పనిచేసి గతేడాది కర్నూలు పీఐయూ కార్యాలయానికి పర్యవేక్షకులుగా బదిలీపై వచ్చారు. జెడ్పీలో పనిచేస్తున్న సమయంలో మాతృభాష పట్ల ఆయన చేస్తున్న కృషిని గుర్తించిన అప్పటి సీఈఓ సూర్యప్రకాష్ ఎంతో ప్రోత్సహించారు. జెడ్పీలోని ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ మాతృభాషలోనే స్వయంగా ఆచరించారు. తెలుగు భాష పట్ల ఆయనకున్న అంకితభావాన్ని గుర్తించి మాతృభాషా దినోత్సవం సందర్భంగా 2013 ఫిబ్రవరి 21వ తేదీన అప్పటి ప్రభుత్వం రాష్ట్రస్థాయి పురస్కారంతో పాటు రూ.5 వేలు నగదు అందించి సత్కరించింది. హైదరాబాదులోని రవీంద్ర భారతిలో జరిగిన ఈ కార్యక్రమంలో అప్పటి మాతృ భాష సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మండలి బుద్ధ ప్రసాద్ చేతులమీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

మధురమైనది మాతృభాష



పుట్టుకతో వచ్చిన అమ్మ భాషను మరచిపోతే మనుగడ ఉండదు. అమ్మ అనే పిలుపులో ఉన్న మాధుర్యం మరెందులోనూ లేదు. ఉన్నత విద్యలో ఇంగ్లిష్, హిందీ తదితర భాషలు అవసరమే. తల్లిదండ్రులు కూడా తమ చిన్నారులు ఆంగ్లంలో మాట్లాడుతుంటే సంబర పడుతూనే... మారుతున్న కాలానికి అనుగుణంగా మాతృభాష పట్ల మమకారం పెరిగేలా కృషి చేయాలి.

– జీవీ క్రిష్టారెడ్డి

'చిలకముక్కు చిన్నోడు'కు పురస్కారం


కథా పుస్తకంతో రచయిత హరికిషన్

కర్నూలు కల్చరల్: జిల్లాకు చెందిన ప్రముఖ కథా రచయిత, బాల సాహితీ వేత్త, తెలుగు ఉపాధ్యాయులు డాక్టర్ ఎం.హరికిషన్ రచించిన 'చిలకముక్కు చిన్నోడు' బాలల కథల పుస్తకం సాహితీ పురస్కారానికి ఎంపికైంది. ప్రొద్దుటూరుకు చెందిన కొనిరెడ్డి ఫౌండేషన్, చదువుల సాహిత్య వేదిక సంయుక్తంగా నిర్వహించిన జాతీయ కథల పుస్తకాల పోటీల్లో ఈ పుస్తకానికి ప్రథమ బహుమతి లభించింది. ఈ మేరకు సంస్థ ప్రధాన కార్యదర్శి ప్రముఖ బాల సాహితీ వేత్త చదువుల బాబు తెలిపారు. చిలక ముక్కు చిన్నోడు పుస్తకంలో 23 కథలు చిన్నారుల ఆలోచన శక్తిని పెంపొందించేలా చక్కని నీతులతో, హాస్యం, విజ్ఞానం కలగలసి సరళమైన భాషలో ఉన్నాయని ప్రశంసించారు. మార్చి 8వ తేదీన ప్రొద్దుటూరులో జరిగే సాహితీ సభలో బహుమతిని అందజేయనున్నట్లు వెల్లడించారు. రూ. 6 వేల నగదు బహుమతిని అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

కల్లూరు: కల్లూరు అర్బన్ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు అన్నారు. గురువారం కల్లూరు అర్బన్ 35, 36, 41వ వార్డులలో డబ్ల్యూబీఎం రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే, కమిషనర్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కల్లూరు అర్బన్ ప్రాతం రోజురోజుకు విస్తరిస్తుందన్నారు. అందుకు అనుగుణంగా అధికారులు ప్రణా ళికలు రూపొందిస్తున్నారన్నారు. కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజా ఫిర్యాదులను సాధ్యమైనంత త్వర గా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. మున్సిపల్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌యూలో అవినీతిపై విచారణ జరిపించాలి

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కన్వీనర్ రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం వర్సిటీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆర్‌యూసీఈ ప్రిన్సిపాల్ రూ.కోట్లలో అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. నిజ నిర్ధారణ చేయించి అక్రమాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు మౌలాలి, రాజు, సాగర్, రాజేష్, అశోక్, ఆకాష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

హంద్రీ నదిని పరిరక్షించాలి

కర్నూలు(సెంట్రల్): హంద్రీ నది పిచ్చి మొక్కలు, ముళ్ల కంపలతో అడవిని తలపిస్తోందని సీపీఎం నాయకులు సుధాకరప్ప, జి.యేసు అన్నారు. గురువారం సీపీఎం నాయకులు కల్లూరు సమీపంలో హంద్రీ నదిని పరిశీలించారు. నదిలో పిచ్చి మొక్కలు పెరగడంతో వరదలు వచ్చినప్పుడు ప్రవాహానికి ఇబ్బందిగా మారుతుందన్నారు. అంతేకాక మురుగు నీరు ముందుకు పారేందుకు అడ్డంకిగా మారిందని, అయినా అధికారులు మాత్రం శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. హంద్రీ నది పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్రంలో బీసీల లెక్కలు తేల్చాలి

కర్నూలు న్యూసిటీ: రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన బీసీల లెక్కలు లేకపోవడం దురదృష్టకరమని వైఎస్సార్‌సీపీ బెస్త సాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో, రాష్ట్రంలో దాదాపు 60 శాతం మంది బీసీలున్నారని, కులగణన చేయకపోవడంతో విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అన్యాయానికి గరవుతున్నారని వాపోయారు. కులగణన చేపట్టి బీసీల లెక్కలు తేల్చాలని, చట్టసభల్లో బీసీలకు 54 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. అన్ని కులాలను గుర్తించి కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని కొనియాడారు.

డ్యూటీల నుంచి మినహాయించాలి

కర్నూలు న్యూసిటీ: ఎస్జీటీలను ఇన్విజిలేటర్, స్క్వాడ్ డ్యూటీల నుంచి మినహాయించాలని ఆప్టా రాష్ట్ర కార్యదర్శి ప్రకాష్‌రావు గురువారం డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలల్లో ఒకరు, లేదా ఇద్దరు టీచర్లు మాత్రమే ఉంటారని, వారికి పదో తరగతి పరీక్షల ఇన్విజిలేషన్,స్క్వాడ్ డ్యూటీ వేయడం వల్ల విద్యార్థులు నష్టపోతారన్నారు.

రాష్ట్ర స్థాయిలో సత్తా చాటాలి

కర్నూలు (టౌన్): పశ్చిమ గోదావరి జిల్లా చిట్యాలలో నిర్వహించనున్న 48వ రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారులకు గురువారం స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ జి.శ్రీధర్‌రెడ్డి, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావుతో కలిసి స్పోర్ట్స్ డ్రస్ పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ.. జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో విజేతలుగా తిరిగి రావాలని ఆకాంక్షించారు.

ఎంఎస్ఎంఈ సర్వే వేగవంతం చేయాలి


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): ఎంఎస్ఎంఈ సర్వేను మరింత వేగవంతం చేయాలని నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు ఆదేశించారు. గురువారం స్థానిక నగరపాలక సంస్థ పరిధిలోని అయ్యప్ప నగర్‌లోని 89వ సచివాలయాన్ని తనిఖీ చేశారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల హాజరుపై పర్యవేక్షణ ఉండాలని సూచించారు. స్థానికంగా పరిమళ నగర్‌లో ఉన్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. అక్కడే టిఫిన్ చేశారు. ప్రజలకు రుచికరమైన ఆహారం అందించాలన్నారు. నాణ్యమైన ఆహారం, నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. అంతకుముందు నగరంలోని బండిమెట్ట, ఛత్రీబాగ్, పెద్ద పడఖానా ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. రహదారులు శుభ్రంగా ఉండాలని, ఎప్పటికప్పుడు చెత్త చెదారాన్ని తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు.

పరిశోధనలపై దృష్టి సారించాలి


నమూనాలను పరిశీలిస్తున్న వీసీ ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్, తదితరులు

కర్నూలు కల్చరల్: యువత పరిశోధనలపై దృష్టి సారించాలని క్లస్టర్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్ అన్నారు. వర్సిటీ పరిధిలోని కేవీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వృక్ష శాస్త్రం ఆధ్వర్యంలో గురువారం ఓపెన్ హౌస్ పేరుతో సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. నమూనాలను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు వృక్ష శాస్త్రంపై అవగాహన ఉంటే భవిష్యత్తులో వచ్చే వ్యాధులు, ప్రమాదాల నుంచి బయట పడవచ్చన్నారు. మొక్కలను నాటి వాటిని సంరక్షించాలన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు కొత్త విషయాలను తెలుసుకొని భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలన్నారు. సృజనాత్మకత ద్వారా వారిలోని ప్రతిభ పెరిగి కొత్త టెక్నాలజీని తెలుసుకుంటారన్నారు. బోటనీ ఇన్‌చార్జ్ డాక్టర్ కేవీ రంగారెడ్డి, అధ్యాపకులు సునీత, మైఖేల్ డేవిడ్, హెలెన్‌కుమారి, శైలజ, భవాని విద్యార్థులు పాల్గొన్నారు.